


రెండు నిట్టాళ్ళ పాకలో మరణశయ్య మీద మృత్యుదేవతతో పోరాడుతున్నాడు అనంతయ్య.

"ఆఖరిక్షణాలు ఎంతో దూరం లేవు," అనుకుంటున్నారు వూళ్ళోవాళ్ళు.

"పాపం పెళ్ళయి ఇంకా రెండేళ్ళయినా నిండ లేదు. ఈ పసిబిడ్డతో ఆ సవతి పిల్లాడితో ఎలా బ్రతుకుతుందో ఏమిటో." చూడవచ్చిన వాళ్ళంతా సానుభూతి చూపిస్తున్నారు.

మంచం కోడుదగ్గరే కూలబడి చేతుల్లో ముఖం దాచుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది సుగుణ. కావల్సిన వాళ్ళందరికీ టెలిగ్రాములు వెళ్ళాయి.

అర్థరాత్రి కాస్త తెలివి వచ్చింది అనంతయ్యకి. అది చావు తెలివేమో.

సుగుణని చేర పిలిచాడు. కళ్ళు తుడుకుని లేచి దగ్గరకు వెళ్ళింది సుగుణ.

"చూడు నిన్ను దిక్కులేని ఒంటరి పక్షిని చేసి పోతున్నాను. ఎలా బ్రతుకుతావో ఏమిటో పిల్లలు జాగ్రత్త" అన్నాడు. హీనస్వరంతో బరువుగా వూపిరి పీలుస్తూ.

"అలా అనకండి నాకు భయం వేస్తోంది," అంటూ బావురుమంది సుగుణ.

లేని ఓపిక తెచ్చుకుని ఆమె తల నిమిరాడు నీళ్ళు నిండిన కళ్ళతో.

ఆ కావిడి పెట్లో మా తరతరాల నుంచీ వారసత్వంగా వస్తున్న ఓ వెండిగిన్నె వుంది. దాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మకు. అది నా తరువాత మన రమణకు చెందాలి." ఆయాసం మాటల్ని మింగేస్తోంది.

అలాగే అన్నట్లు తల ఊపింది సుగుణ.

ఆ తర్వాత ఇంక అనంతయ్యకు మాట్లాడే అవసరం తీరిపోయింది.

ఇంట్లో ఎర్రని ఏగానీలేదు. ఊళ్ళో వాళ్ళే తలో చెయ్యివేసి శవాన్ని కాటికి తరలించారు.

బంధువర్గం అంతా అనంతయ్య పరిస్థితి తెల్సిన వాళ్ళే కావటంవల్ల డబ్బు సహాయం చెయ్యవల్సి వస్తుందేమో అని మొహాలు చాటేసినా, సుగుణ వైపు వాళ్ళూ, మొదటి భార్య అన్నతమ్ములూ మొహమాటానికైనా రాకపోతే బావుండదు అన్నట్లు వచ్చారు.

పదిరోజుల ఖర్మకాండలూ ఒక్కరోజుతోనే ముగించి చేతులు దులుపుకున్నారు.

పన్నెండోరోజు అనంతయ్య మొదటి భార్య కొడుకు ఆరేళ్ళ రమణ విషయం అందరికీ సందిగ్ధంగానే మిగిలిపోయింది.

"మా పిల్లే పోయాక వేలెడు వెధవతో మాకేమిటి, మాకేం సంబంధం లేదు." అంటూ రమణ మేనమామలు నిష్కర్షగా తప్పుకున్నారు.

"ఆ పిల్లాడిని వదిలి వస్తే నీ సంగతి ఆలోచిస్తాం," అన్నారు సుగుణవైపు వాళ్ళు.

ఎటూ పాలుపోని సుగుణ తను ఉన్న పరిస్థితిని కూడా మర్చిపోయి పిల్లవాడిని గురించే ఆలోచించింది. వాడి ముఖంలో పసిదనం, కళ్ళల్లోని అమాయకత్వం ఆ మాతృ హృదయాన్ని మెలి పెట్టాయి.

"ఈ ఇద్దరు పిల్లలూ నాకు రెండు కళ్ళు. చిన్న వయసులోనే తల్లినీ తండ్రినీ పోగొట్టుకున్న వీడు అనాథ కావటానికి వీల్లేదు. వీడూ నా బిడ్డే. నేనే వీడికి తల్లిని," అనేసింది అనాలోచితంగానే.

ఆమె నిర్ణయాన్ని ఊళ్ళోవాళ్ళు హర్షించినా ఆమె తరఫువాళ్ళు ఆమోదించలేదు.

"ఇవాళనుంచీ నీకూ మాకూ ఏ సంబంధం లేదు. నీ బ్రతుకేదో నువ్వే బ్రతుకు," అంటూ వెళ్ళిపోయారు.

ఇద్దరు పిల్లల్నీ హృదయానికి హత్తుకుని కన్నీళ్ళతో శూన్యంలోకి దీనంగా చూస్తూ ఉండిపోయింది సుగుణ.

*

చిన్నవయసులోనే సుగుణ సుగుణమ్మ అయి ఊరివాళ్ళకి తలలో నాలుకలా మెలుగుతూ అడిగిన వాళ్ళకు లేదు అనకుండా సహాయం చేసిపెట్టి, రెక్కలు ముక్కలు చేసుకుని వాళ్ళిచ్చే తృణమో, పణమో తీసుకుని మగపిల్లాడు రమణని పెద్ద చదువులు చదివించటానికే నిశ్చయించుకుంది.

ఇప్పుడు రమణ ఆమె సవతికొడుకంటే ఎవరూ నమ్మరు. 'అమ్మ అమ్మ' అంటూ అనుక్షణం కొంగుపట్టుకుని తిరిగేవాడు కన్నకొడుకు కాకుండా ఎలా ఉంటాడు?

రమణ చెల్లెలు జయను విడిచి క్షణం ఉండేవాడు కాదు.

అనుకోకుండా ఆ ఊళ్ళో మాలపల్లెలో ఆరంభమైన కలరా సూక్లు పిల్లలద్వారా రమణకీ అంటుకుంది. బిడ్డ ఏమైపోతాడా అని హడలిపోయింది సుగుణమ్మ.

ఊళ్ళో వాళ్ళంతా తమకీ అంటుకుంటుందన్న భయంతో సుగుణమ్మని ఊరు విడిచి పొమ్మన్నారు. పిల్లలిద్దరితో ఊరిబైట ఒంటరిగా ఉండి తనకు తెల్సిన మందూ మాకులతో నెమ్మదించాక తిరిగి ఊళ్ళోకి చేరుకుంది. తరచుగా రమణకి వచ్చే రోగాలతో నానాబాధలూ పడేది.

మెల్లిగా హైస్కూలు చదువుకు వచ్చాడు రమణ.

ఆడపిల్లకి చదువు ఎందుకు, రమణ అభివృద్ధిలోకి వస్తేచాలు అనుకుని జయని స్కూలు మాన్పించి తన చేతికింద పనుల్లోకి సాయం చేసుకుంది.

వంటలు చేసి, విస్తళ్ళు కుట్టి, అప్పడాలు చేసి, ఊరగాయలు పెట్టి ఎవరు ఏ పని చేసినా కాదనకుండా చేసిపెడుతూ క్షణం తీరికలేకుండా రమణ చదువే తన ఏకైక లక్ష్యంగా పెట్టుకుంది. రమణ ఏం అడిగినా కాదు లేదు అనకుండా అమర్చి పెట్టేది. తను, జయ ఎలాంటి బట్టలు కట్టుకున్నా అతనికి మంచి బట్టలు, పుస్తకాలు అన్నీ కొనేది.

ఇంటి ఖర్చులు అధికం కావటంతో పాత మిషన్ కొనుక్కుని అందరి బట్టలూ కుట్టటం ప్రారంభించింది సుగుణమ్మ.

"ఏమిటి సుగుణమ్మా రమణ అడిగిందల్లా చేస్తున్నావు, రేపు వాడు పెద్దయితే నీ మాట విని నీకు తిండిపెడతాడా కాస్త ముందూ వెనకా చూసుకో," అనేవారు తెల్సినవాళ్ళు.

వాళ్ళ మాటలకు నవ్వుకునేది ఆమె.

వాడికీ నాకూ లేనిబేధం వీళ్ళకి ఎందుకో అన్పించేది.

రమణ కాలేజీలో చేరాడు.

స్నేహితులవల్ల సిగరెట్లు, సినిమాలు అలవాటు అయ్యాయి.

ఒకొక్కసారి అతన్ని మందలిద్దాం అనుకున్నా ఏం అంటే ఏం నొచ్చుకుంటాడో వయసు వచ్చిన బిడ్డ అనుకుని ఊరుకునేది.

సుగుణమ్మ ఫలితానికి మించిన శ్రమపడటంతో అనారోగ్యం ఆమె వంట్లో చోటు చేసుకుని ఆమె నడుముని కృంగదీసి కర్ర చేతికి ఇచ్చింది.

రమణ డిగ్రీ పూర్తిచేసి ఈ చదువుకి సరైన ఉద్యోగం రాదనీ, పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తానని పట్టుపట్టాడు.

కాదనలేకపోయింది సుగుణమ్మ.

ఓపిక తగ్గిన సుగుణమ్మ కష్టం, జయ శ్రమ ఫలితంగా అతని చదువు పూర్తి అయింది.

అనుకోకుండా వెంటనే మంచి ఉద్యోగం వచ్చింది.

దాంతో ఆమె గుండెలమీద భారం తీరి ఏనుగెక్కినట్లయింది.

సంతోషంగా, ప్రశాంతంగా, హాయిగా ఊపిరి పీల్చుకుంది సుగుణమ్మ.

*

"అక్కయ్యా," అంటూ చనువుగా పిలుస్తూ సరాసరి లోపలికే వచ్చిన చుట్టం ఎవరా అని నడుం మీద చెయ్యి ఉంచుకుని కళ్ళజోడులోంచి పరీక్షగా చూసింది సుగుణమ్మ.

"నేనే అక్కయ్యా రమణ చిన్న మేనమామని, రామచంద్రాన్ని. ఎంతైనా అక్కకొడుకు రక్త సంబంధం ఎక్కడికి పోతుంది చెప్పు. పనిమీద ఈ ఊరు వచ్చి చూసిపోదామని వచ్చాను. ఇదిగో ఇది నా కూతురు సంధ్య," అన్నాడు.

"అలాగా కూర్చోండి. అబ్బాయి బైటికి వెళ్ళాడు వచ్చేస్తాడు," అంటూ కుశల ప్రశ్నలు వేసి మర్యాదలు చేసింది.

మరో పదినిముషాలకు బైటనుంచి వచ్చిన రమణ కళ్ళు మెరిసాయి సంధ్య అందం చూసి.

ఆరోజంతా సంధ్య ఆకర్షణకి లోనై వాళ్ళనే అంటిపెట్టుకుని తిరిగాడు రమణ.

మర్నాడు వెళ్ళబోయే ముందు తన మనసులో విషయం బైటపెట్టాడు రామచంద్ర.

సంధ్యను రమణకి చేసుకోమని, తెగిపోయిన బాంధవ్యాన్ని కలుపుకోమని ప్రాధేయపడ్డాడు.

అనాడు 'వేలెడు వెధవ వీడితో మాకేమిటి', అన్న వాళ్ళమాటల్ని పునశ్చరణ చెయ్యకుండా తనలో తనే తల్చుకుని నవ్వుకుంది సుగుణమ్మ.

రమణ కూడా సంధ్యనే చేసుకుంటాను అనటంతో కాదు అనలేకపోయింది.

ముత్తంమీద ఘనంగానే పెళ్ళి జరిగిపోయింది.

కోడలు కాపరానికి వచ్చాక వారసత్వంగా వస్తున్న వెండిగిన్నెతోపాటు భర్త చెప్పిన మాటల్ని కూడా వాళ్ళకి అప్పగించింది సుగుణమ్మ.

ఇంక మిగిలింది జయ పెళ్ళి. ఓరోజు రమణ దగ్గర ఆ ప్రస్తావన తెచ్చింది. కానీ రమణ తనకి ఈ పెళ్ళితో ఏం సంబంధం లేనట్లు మాట్లాడటంతో తెల్లబోయింది.

ఫలితం ఆశించికాదు ఆమె ఈ మొలకను మాను చేసింది.

గంతకు తగ్గ బొంత అన్నట్లు తిండి బట్టకు లోటులేని బడిపంతులితో జయపెళ్ళి ఉన్నంతలో బాగానే జరిపించింది స్వయంకృషితో.

'ఇంక తన ఒక్క ప్రాణం. ఎట్లా అయినా వెళ్ళిపోతుంది', అనుకుని సంతృప్తిగా నిట్టూర్చింది.

*

"అమ్మా నువ్వలా వీధిలో కూర్చోకు అవతల సంధ్య ఫ్రెండ్స్ వస్తే నిన్ను చూసి ఏం అనుకుంటారు."

"అమ్మా ఈ కూర నువ్వు చేస్తే బాగుండటం లేదు సంధ్య చేస్తుందిలే."

"ఈ రోజు సంధ్య పుట్టిన రోజు. సాయంత్రం పార్టీ ఉంది నువ్వు హాల్లోకి రాకుండా పెరట్లో కూర్చో."

ఇలాంటి మాటలు ఆమె గుండెల్ని కోసేస్తున్నా పిచ్చిదానిలా తనలో తనే నవ్వుకునేది కొడుకులో వచ్చిన మార్పుకి.

వీడు తన కొంగుని అంటిపెట్టుకుని తిరిగిన రమణేనా అన్పించించేది.

సంధ్యకి అత్తగారి పొడంటేనే గిట్టదు. ఆమె నీడ అసలే పడదు.

రమణ ముగ్గురు బిడ్డల తండ్రి అయినా ఆమె కంటికి అతనింకా పసిబిడ్డగానే కన్పిస్తాడు.

సుగుణమ్మ మనుమలతో కాలాన్ని పంచుకోవాలని చూసినా వాళ్ళని ఆమె దరికే చేరనివ్వదు సంధ్య.

ఆమె పెంపకంలో అల్లరిగా పెంకిగా మొండిగా తయారయ్యాడు పెద్దవాడు రామూ.

*

వారం రోజుల నుంచీ జ్వరం కాసి ఆ రోజు పూర్తిగా తగ్గటంతో లేచి కూర్చుంది సుగుణమ్మ.

ఆకలితో కడుపు నకనకలాడుతోంది.

ఆదివారం కావటంతో రమణ పిల్లలూ అంతా ఇంట్లోనే ఉన్నారు.

ఉదయంనుంచీ రమణా సంధ్యా ఏదో విషయమై కీచులాడుకుంటున్నారు.

చివరికి ఒంటిగంట దాటాక సుగుణమ్మకి విస్తట్లో భోజనం కన్పించింది. ఆత్రుతగా ఆకలిగా అన్నం కలిపి ముద్ద నోట్లో పెట్టుకోపోయింది సుగుణమ్మ.

బెంగాల్ విభజన జరిగినది....

"అమ్మా," కొడుకు అరుపు పిలుపులా కాక ఊమినట్లు విన్పించడంతో ఉలిక్కిపడి తలెత్తి చూసింది.

ఎన్నడూ అలా పిలిచి ఎరగని కొడుకు పిలుపు వింతగా అన్పించింది ఆమెకి.

"బీరువాలో వెండిగిన్నె ఉండాలి ఏమైంది?" అన్నాడు విసురుగా.

"వెండిగిన్నా నాకేం తెల్సునాయనా అది మీకేగా ఇచ్చాను," అంది ఆశ్చర్యంగా చూస్తూ.

"ఇచ్చావులే, అది ఇప్పుడు కన్పించటంలేదు. ఏమైందని అడుగుతున్నాను?"

"నాకు తెలియదురా రమణా, నేను వారం రోజులుగా ఆ గదివైపే రాలేదు," అంది నీరసంగా.

"అడిగితే చెబుతుందా ఆ మనిషి. ఎక్కడికి చేరాలో అక్కడికే చేర్చి ఉంటుంది," అంది సంధ్య.

వాళ్ళు అనేదేమిటో అర్థం కాలేదు సుగుణమ్మకి.

"మేం బీరువాకి తాళం వేయటం మరిచిపోయి బైటికి వెళ్ళాం. ఉదయం చూస్తే దాంట్లో గిన్నె లేదు. ఇంట్లో ఉండాల్సిన గిన్నె కాళ్ళొచ్చి నడిచి వెడుతుందా బైటికి. నిన్న సాయంత్రం వచ్చిందిగా నిన్ను చూసే వంకతో నీ కూతురు దానికే ఇచ్చి ఉంటావు. ఎంతైనా సవతి తల్లివి అన్పించావు," అంటూ కోపంగా వెళ్ళిపోయాడు రమణ.

హటాత్తుగా వెయ్యి పిడుగులు వచ్చి నెత్తిన పడినట్లు, సప్తసముద్రాలూ ఏకమై పొంగిపోయి అందులో తను కొట్టుకుపోతున్నట్లు అన్పించి మాటలూ చేష్టలూ ఉడిగి నోట్లో పెట్టుకోపోతున్న అన్నం ముద్ద కంచంలో జారిపోయి ప్రాన్పడిపోయింది సుగుణమ్మ.

చిన్నప్పటినుంచీ తను ఎన్ని కష్టాలు భరించి పెంచినదీ ఆలోచించలేదు ఆమె మనసు ఆక్షణంలో.

త్యాగమయులు తాము ఇతరులకి చేసిన సహాయాన్ని గుర్తుంచుకోరు. కొడుకు తనకు అంటగట్టిన దొంగతనం విషయం కూడా గుర్తుకురావటం లేదు ఆమెకి.

"ఎంతైనా సవతి తల్లివి అన్పించావు.... ఎంతైనా సవతి తల్లివి అన్పించావు," పదే పదే అవే మాటలు చెవుల్లో మారుమ్రోగుతున్నాయి. గుండెల్లో గునపాలు దిగినట్లు గుచ్చుకుంటున్నాయి.

విండు విస్తరి అలాగే చుట్టపెట్టి గోడ అవతల పారేసి వెళ్ళి తులసి గట్టుమీద కూర్చుండిపోయింది దిగులుగా దిగాలుగా.



స్వీయ పరిచయం

మాడుగుల దుర్గావళిగా పాఠకలోకానికి పరిచితురాలిని. ఇటీవలే వివాహానంతరం గొల్లపూడి దుర్గావళిగా మారాను. ప్రస్తుత నివాసం విశాఖపట్నం. శ్రీవారు నేషనల్ ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్‌లో ఉద్యోగి. వివాహమైనా రచనా వ్యాసంగానికి అవరోధం కలగకపోవటానికి కారణం శ్రీవారి ప్రోత్సాహం. ప్రస్తుతం మాస్టర్ డిగ్రీ సాధించాలనే ప్రయత్నంలో ఉన్నాను. ఇంతవరకూ స్వవిషయం.

ఇంక రచన విషయానికి వస్తే పదిహేను పైగా నవలలు, యాభైవరకూ కథలు, మరి కొన్ని అపరాధ పరిశోధక కథలూ, రేడియో కథానికలూ, నాటికలూ చాలా ఉన్నాయి. మంచి రచనలు చేసి పాఠక లోకాన్ని మెప్పించాలన్నది ముఖ్య ఆశయం.

—జి. దుర్గావళి

"నేను వాడికి సవతితల్లినా?" మనసు గతంలోకి వెళ్ళి ఎంత తరచి చూసినా రమణకి తను సవతితల్లి అనటానికి ఏ ఆధారమూ కన్పించలేదు ఆమెకి.

రాత్రంతా అలాగే కూర్చుని తెల్లవారుజామున చెంబుతో నీళ్ళు చేత కర్రా పట్టుకుని కాలువ ఒడ్డుకి వెళ్ళింది సుగుణమ్మ.

*

"రమణయ్యగారూ .... రమణయ్యగారూ ఉదయం కాలువగట్టున ఈ కర్రా చెంబూ కన్పించాయి. చెంబుమీద పేరుచూసి మీదని గుర్తుపట్టాం. ఇవి మీ అమ్మగారి వేగా," అని ఊళ్ళోవాళ్ళు అడగటంతో అవి అక్కడికి ఎలా వెళ్ళాయో తల్లిని అడగటానికి వెళ్ళాడు రమణ.

కన్పించని తల్లికోసం సాయంత్రం దాకా ఇళ్ళు తోటలూ, దొడ్లూ, నూతులూ అన్నీ వెతుకుతూనే ఉన్నాడు.

అప్పటికే సుగుణమ్మ ఏమైందో అందరికీ అర్థం అయింది.

రెండురోజులు కాలువలో వలలు వేసి గాలించారు.

కొడుకుచేత అంతమాట అన్పించుకున్నాక అతనికి తన శవం కూడా కన్పించకూడదు అనుకున్న సుగుణమ్మ కోరిక నెరవేరింది.

తల్లి హటాత్తుగా ఇలా అంతంకావటానికి కారణం ఎంత ఆలోచించినా అర్థం కాలేదు రమణకి.

సుగుణమ్మ పోయిన నాలుగోరోజు ఇంటి ముందు పోలీసు జీపు ఆగటంతో బైటికి వెళ్ళాడు రమణ.

"రమణమూర్తిగారంటే మీరేనా," అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"అవును," అన్నాడు అతనికి తనతో ఏం పనా అని తెల్లపోతూ.

"పెద్ద మార్కెట్లో శేఠ్ ఠాకూర్‌లాల్ షాపులో మీ అబ్బాయి రామూ అతని ఫ్రెండూ ఈ వెండి గిన్నె అమ్ముతుంటే పట్టుకున్నాం. ఇది మీదేనా?" అన్నాడు గిన్నె చూపిస్తూ.

"అవును," అన్నట్లు తల ఊపాడు.

తల్లి అలా ఎందుకు చెయ్యాల్సివచ్చిందో తను అన్నమాట ఎంత పదునైనదో అప్పటికి కానీ తెల్సి రాలేదు అతనికి.

పెనుగాలికి రెపరెపలాడి ఏక్షణంలోనో ఆరిపోటానికి సిద్ధంగా ఉన్న తన జీవితం అనే దీపాన్ని వెల్గించటానికి ఆమె ప్రమిదలా ఆధారమై రక్తాన్ని నూనెలా మార్చి తన జీవనజ్యోతిని వెల్గించి కాంతి పుంజాలను వెదజల్లిన దేవత ఆమె. అలాంటి తల్లికి తను చేసిందేమిటి?

ఆమెను అనుమానించి, అవమానించి నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించి ప్రమిదను మరచిన దీపంలా మారాడు. ఆరిపోయే దీపాన్ని వెల్గించటానికి ఆమె ప్రయత్నిస్తే, వెలుగుతున్న దీపాన్ని నిర్దయగా, కర్కశంగా 'ఉఫ్' అంటూ ఊదేసిన పురుగు తాను.

పశ్చాత్తాపంతో అతని కళ్ళనుంచి వెచ్చని రెండు కన్నీటి బొట్లు నేలరాలాయి సుగుణమ్మకి ఆత్మశాంతికా అన్నట్లు. □

భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడినది....